ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ ఐ.రాజీవ్

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్‌టిఆర్ వైద్యసేవలో వైద్యం చేయడం కుదరదని, డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో ఎటువంటి ఫిర్యాదు రాలేదని, అలా జరుగుతుందని తెలిస్తే వెంటనే నెట్‌వర్క్ ఆసుపత్రులపై తగు చర్యలు తీసుకుంటామని ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ ఐ.రాజీవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 'ఎన్‌టిఆర్ వైద్యసేవ'లో భరోసా కరువు అంటూ మంగళవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. ఏలూరు జిల్లాలో మొత్తం 33 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఎన్‌టిఆర్ వైద్యసేవలో పని చేస్తున్నాయని తెలిపారు.

కంపెనీలకు అండగా.. రైతులకు వ్యతిరేకంగా..!

జిల్లా ఉద్యా శాఖ అధికారుల తీరుపై రైతుల ఆవేదన

కోకో రైతుల ధర సమస్యపై అధికారుల తీరు వివాదాస్పదం

అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో ధర అమలులో విఫలం

ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ధరపై ప్రచారం

నాణ్యత పేరుతో కంపెనీల దోపిడీకి అధికారులు అండ

నాణ్యత ప్రమాణాలు కలిగియున్న కోకో గింజల ధరలు
పాతవి : ₹ 300/కిలో
క్రొత్తవి : ₹ 550/కిలో
నాణ్యత ప్రమాణం ఆధారంగా పై ధర లభించునని "మోడలైజ్" కంపెనీ వారు తెలిపారని ఉద్యానవన అధికారు వారు తెలిపారు..
నాణ్యత అనగా కోకో గింజల్లో ఎలాంటి చెత్త,చెదారం,ఆకులు,అలమలు,కర్రలు ముక్కలు,పాడైన గింజలు లేకుండా తగు తేమశాతం కలిగియుండుట..
రైతుల వద్ద అందుబాటులో ఉన్న కోకో గింజల వివరాలు ఉద్యానవన అధికారి వారి కార్యాలయానికి పంపించుట జరిగినది.కావునా సదరు కంపెనీ వారు ఆ రైతులను సంప్రదిస్తారు..
Edited 16:21

ప్రభుత్వ పరిశీలనలో ఉండగా కోకో ధరపై వాట్సాప్‌లో పెట్టిన ఉద్యానశాఖ అధికారులు మెసేజ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోకో రైతులకు అండగా పని చేయాల్సిన జిల్లా ఉద్యాన శాఖ అధికారులు.. అందుకు విరుద్ధంగా కోకో పంటను కొనుగోలు చేసే కంపెనీలకు సలాం కొడుతూ అన్నదాతను దెబ్బతీస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి, రాష్ట్ర ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన చర్చలు, నిర్ణయాలను సైతం లెక్క చేయకుండా కంపెనీలకు అండగా జిల్లా ఉద్యాన శాఖాధికారులు వ్యవహరిస్తున్న తీరుతో రైతుల్లో తీవ్ర ఆవేదన

జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయం

వ్యక్తమవుతోంది. జిల్లా ఉద్యాన శాఖాధికారుల తీరుతో కడుపు మండిన కోకో రైతులు ఆ శాఖ జిల్లా కార్యాలయంలోనే బైఠాయించి నిరసన తెలిపారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. గతం లో లేని నాణ్యత నిబంధనలు తెరపైకి తెచ్చి కంపెనీలు చేస్తున్న దోపిడీకి జిల్లాలోని ఉద్యాన శాఖాధికారులు అండగా నిలుస్తూ వంతపాడుతున్న తీరు రైతులను విస్మయానికి గురిచేస్తోంది. కోకో రైతుల సమస్యలపై రాష్ట్రస్థాయి అధికారులు చూపిస్తున్న చొరవ కూడా జిల్లా అధికారులు చూపించకపోవడం అందుకు నిదర్శనమని రైతులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 75 వేల ఎకరాల్లో కోకో సాగవుతుండగా, జిల్లాలోనే 33 వేల ఎకరాల్లో సాగవుతోంది. కోకోకు అంతర్జాతీయ మార్కెట్ ఆధారంగా ధర నిర్ణయం ఉంటుంది. గతేడాది కిలో కోకో గింజలు ధర రూ.వెయ్యికిపైగా పలికింది. ఈ ఏడాది ప్రస్తుతం కోకో గింజల ధర అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో రూ.750 వరకూ ఉంది. కంపెనీలు మాత్రం రైతులకు అందుకు తగిన ధర ఇవ్వడం లేదు. పాత గింజలైతే కిలో రూ.300లోపే కొనుగోలు చేస్తున్నారు. దీనిపై కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించగా కంపెనీలను పిలిచి మాట్లాడతామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా మార్చి 13న జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.రామ్మోహన్ రైతులతోనూ, కంపెనీలతో చర్చించారు. పాత గింజలు 700 టన్నులకుపైగా ఉన్నాయని, కొనుగోలు చేయాలని కోరారు. పాత, కొత్త గింజలతో సంబంధం లేకుండా కిలో రూ.600కు కొనుగోలు చేస్తామని కంపెనీలు ఆ రోజు చెప్పాయి. కొనుగోలు మాత్రం చేయలేదు. దీంతో మార్చి 17న అమరావతిలో ఉద్యావనశాఖ రాష్ట్ర డైరెక్టర్ కె.శ్రీనివాస్ సమక్షంలో మరోసారి చర్చలు జరిగాయి. అక్కడ సైతం ఇదే హామీ ఇచ్చారు. మార్చి 20న విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు జరిగింది. సదస్సులో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా కోకో రైతులు ఆందోళన బాట పట్టారు.

ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యాన శాఖ జిల్లా అధికారులు..!

ఏప్రిల్ మూడో తేదీన వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడు సమక్షంలో మరోసారి కోకో రైతులు, కంపెనీలతో చర్చలు జరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా కోకో గింజలను కొనుగోలు చేయాలని మంత్రి సైతం చెప్పారు. 3;1 నిష్పత్తిలో మూడు క్వింటాళ్ల కొత్త గింజలు కొనుగోలు చేస్తే, ఒక క్వింటా పాత గింజలు కొనుగోలు చేసేలా నిర్ణయించారు. కిలోకు రూ.550 ధర ఇచ్చేలా కంపెనీలు ఒప్పుకున్నాయి. దీనిపై ప్రభుత్వం ప్రకటన చేస్తానని చెప్పింది. ప్రభుత్వ ప్రకటన రాకముందే ఏప్రిల్ తొమ్మిదో తేదీన నాణ్యత ఉన్న కోకో గింజలు పాతవి కిలో రూ.300, కొత్త గింజలు రూ.550కు కొనుగోలు చేయనున్నట్లు మోడలైజ్ కంపెనీ తెలిపినట్లు ఉద్యాన శాఖాధికారులు వాట్సాప్‌లో మెసేజ్ పెట్టారు. అసలు కిలో రూ.300 ధర అనేది కోకో రైతులతో జరిగిన ఏ చర్చల్లోనూ నిర్ణయం జరగలేదు. మరి ఉద్యాన శాఖాధికారులు ఏవిధంగా ప్రకటించారో అర్థం కాని పరిస్థితి. పాత గింజలు 700 టన్నులకు పైగా ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కిలోకు రూ.250 నష్టపోతే రైతులకు ఎంతమేర నష్టం వస్తుందో వేరే చెప్పనక్కర్లేదు. ఉద్యాన శాఖాధికారులు కంపెనీలకు అండగా తక్కువ ధర నిర్ణయిస్తూ ప్రకటన చేయడంపై కోకో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతోజిల్లా కార్యాలయం లోపల బైఠాయించి ఆందోళన చేపట్టారు. అప్పుడు సైతం జిల్లా ఉద్యాన అధికారులు కంపెనీలకు అండగా మాట్లాడుతూ రైతులు ఇష్టమైతే అమ్ముకుంటారని వాదనకు దిగడం గమనార్హం. వాట్సాప్‌లో వచ్చిన మెసేజ్ ఫేక్ అని, దీనిపై ప్రకటన ఇస్తామంటూ రైతులకు చెప్పారు. ఇప్పటి వరకూ ఎటువంటి ప్రకటనా విడుదల చేయలేదు. ఇదంతా ఉద్దేశపూర్వకంగానే అధికారులు చేశారని అర్థమవుతోంది. కంపెనీలకు కొమ్ముకాస్తూ జిల్లా ఉద్యాన శాఖ అధికారులు కావాలనే డ్రామా ఆడుతున్నారనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ఉద్యాన శాఖాధికారులు పదే పదే గతంలో ఎన్నడూ లేని నాణ్యత గురించి మాట్లాడటం, కంపెనీలకు అనుకూలంగా మాట్లాడుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.

పాత గింజలు రూ.550కు కొనుగోలు చేయడం లేదు

ఎస్.రామ్మోహన్, జిల్లా ఉద్యాన శాఖాధికారి

కోకో రైతుల ధరకు సంబంధించి ప్రభుత్వం కమిటీ వేసింది. నివేదిక రావాల్సి ఉంది. కోకోకు అంతర్జాతీయ మార్కెట్లో ఉదయం ఒక ధర, సాయంత్రం ఒక ధర ఉంటుంది. ధర నిర్ణయం సాధ్యం కాదు. ప్రస్తుతం కిలో కోకో గింజల ధర రూ.550 ఉంది. పాత గింజలు కొనుగోలు చేస్తున్నారుగాని, రూ.550 ధర మాత్రం ఇవ్వడం లేదు. నాణ్యతను బట్టి ధర ఉంటుంది. రైతులు తమకు నచ్చిన చోట అమ్ముకోవచ్చు. ధరపై వాట్సాప్‌లో వచ్చిన మెసేజ్ ఫేక్. ఏదో ఒక ఆర్ఎస్‌కె నుంచి వచ్చినట్లు రైతులు తెలిపారు.

శాస్త్రవేత్తలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులదే

పాఠశాల స్థాయి నుండి సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రయోగశాలను ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఎస్‌పి, ఎంపీ

నేటి విద్యార్థులను భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు రూ.2 కోట్ల విలువైన ప్రయోగ పరికరాలను అందించే కార్యక్రమాన్ని జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందని అన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన దేశం అభివద్ధి పథంలో పయనిస్తుందన్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలని, ప్రతి విషయాన్నీ తెలుసుకోవాలనే ఉత్సుకత విద్యార్థుల్లో రేకెత్తినప్పుడే వారు జీవితంలో ముందుకెళ్తారన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు ఉత్తమ సేవలందించడం ప్రభుత్వ ప్రాధాన్యతన్నారు. ప్రయోగశాలలో నేర్చుకున్న విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగశాలలు పేరుకు మాత్రమే ఉండేవన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ప్రయోగశాలలు, క్రీడామైదానాలు, అదనపు తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే విద్య అభ్యసించానని, తాను చదివిన పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్ అందించానన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలోనూ రెండు ఉన్నత పాఠశాలలను గుర్తించి, ఒక్కొక్క పాఠశాలకు రూ.4 లక్షలు విలువ చేసే ప్రయోగ పరికరాలు అందిస్తున్నానన్నారు. సెల్‌ఫోన్‌లో సామజిక మాధ్యమాలకు బానిస కావొద్దన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయిని పెంపొందించేలా రూ.2 కోట్లతో ప్రయోగ పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. జిల్లా పరిషత్ ద్వారా రూ.50 లక్షలతో విజయకేతనం పుస్తకాన్ని విద్యార్థులకు అందించామని, వీటి వినియోగంతో పాఠశాలల్లో ఉతీర్ణతా శాతం పెరిగిందని అన్నారు. జిల్లా కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ క్లాస్‌రూమ్‌లో విన్న పాఠాలతోపాటు ప్రయోగాల ద్వారా తెలుసుకున్న జ్ఞానం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఏ రంగంలో అభిరుచి ఉందో తెలుసుకుని, ఆ రంగంలో వారికి ఉత్తమ విద్యను అందించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇంతటి ఉన్నత స్థానానికి చేరుకున్నానని, ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని అన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయి లక్ష్యాలను నిర్దేశించుకునేలా ఉపాధ్యాయులు, విద్యార్థులను చైతన్యపర్చాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో హెచ్ఇసి, సిఇసి కోర్సులను ప్రవేశపెట్టాలని, అదేవిధంగా క్రీడామైదానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ వెంటనే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రయోగశాలను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన షేక్ షాజితా, ఎమ్.డి.మెబినాలను దుశ్శాలువాతో ఎంపీ సత్కరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు అంతా కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్‌లను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), డిఇఒ వెంకట లక్ష్మమ్మ, సర్వశిక్షాభియాన్ ఎపిసి పద్మకుమార్, ఏలూరు మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, స్థానిక కార్పొరేటర్ టి.అరుణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్‌కుమార్, పూజారి నిరంజన్ పాల్గొన్నారు.

కోకోకు గిట్టుబాటు ధర కల్పనకు ప్రభుత్వం కృషి

కోకో రైతులతో ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్ ముఖాముఖి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ, ఏలూరు అర్బన్



ఎంపీ మహేష్‌కుమార్‌కు వినతి అందిస్తున్న నేతలు

పామాయిల్ తరహాలోనే కోకోకు గిట్టుబాటు ధర కల్పించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎంపీ మంగళవారం కోకో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవల ఆగిరిపల్లి పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించినందుకు ఎంపీకి కోకో రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రైతులు మాట్లాడుతూ రాష్ట్రంలో 75 వేల ఎకరాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా కోకో సాగు చేస్తున్నామని, రాష్ట్రంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో కోకో సాగు విస్తీర్ణం ఉందని తెలిపారు. అప్పు చేసి పెట్టుబడి పెట్టి కోకో గింజలు ఉత్పత్తి చేస్తున్నామని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. గత సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలకు రూ.1040 వరకు ధర వచ్చిందని, ప్రస్తుతం కిలో రూ.700కు పైగా ధర ఉన్నా కొనుగోలు కంపెనీలు ఆ ధర చెల్లించడం లేదని, పాత, కొత్త గింజల పేరుతో కోకో రైతులను కంపెనీలు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని చెప్పారు. ఇక్కడ కంపెనీలు సిండికేట్‌గా మారి కిలో కోకో గింజలకు రూ.480 నుండి రూ.550 వరకు ధర ఇస్తున్నాయని, అన్‌సీజన్ గింజలను రూ.200 నుండి రూ.240 వరకు కొనుగోలు చేస్తున్నారని, ఇంతకు ముందు లేనివిధంగా గ్రేడింగ్ విధానం తీసుకొచ్చి తమను ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. అనంతరం ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కోకో రైతుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కోకో రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వారి సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందని, త్వరలోనే శుభవార్త వింటారని ఎంపీ రైతులకు హామీ ఇచ్చారు. తొలుత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజల ధరల ఒప్పంద ప్రకటన చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎపి కోకో రైతులసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడగా సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు గుదిబండి వీరారెడ్డి, ఎస్.రాధాకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష-బాబు, పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ ఏజెన్సీలో భూసమస్యలను పరిష్కరించాలి

గిరిజన చట్టాలను అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ

ప్రజాశక్తి - పోలవరం

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నేతలు

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో భూసమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ పశ్చిమ ఏజెన్సీలో భూవివాదాలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. భూవివాదాలు తలెత్తినప్పుడు గిరిజనేతరుల భూమి రికార్డులు టైటిల్ వెరిఫికేషన్ చేయకుండా గిరిజనులను రికార్డులు తీసుకురమ్మని తహశీల్దార్ చెప్పడం సరైంది కాదన్నారు. 1/70, ఎల్‌టిఆర్ గిరిజన చట్టాలున్నా రెవెన్యూ అధికారులు అమలు చేయడం లేదన్నారు. గిరిజనుల హక్కులకు రక్షణ కల్పించాల్సిన అధికారులే ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. భూవివాదాల్లో పోలీసుల జోక్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఎల్‌టిఆర్, 1/70 చట్టం భూములను సాగు చేస్తున్నా రెవెన్యూ రికార్డుల్లో నమోదు కావడం లేదన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న భూముల్లో 1బి, అడంగల్‌లో నమోదు చేసి హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2011లో ఇటుకలకోట గిరిజనులకు కొంతమందికి పోడు భూములకు హక్కు పట్టాలిచ్చినా అటవీ అధికారులు ఆ భూముల్లో సరిహద్దు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ మండలంలో రహదారులన్నింటినీ బాగు చేయాలన్నారు. కల్వర్టులు, వంతెనల నిర్మాణం చేపట్టాలన్నారు. శ్మశానాలు, తాగునీరు, డ్రెయినేజీలు, పాఠశాలల విలీనం సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు తామా బాలరాజు, బొరగం భూచంద్రరావు, మడివి చలపతిరావు, కొమరం పోసిరత్నం తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ, నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

అధికారులకు ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న ధాత్రిరెడ్డి

జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించి భూసేకరణ, నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణ, భూసేకరణ అంశాలపై అధికారులతో ఆమె మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం నుంచి దేవరపల్లి 365 బిజి (గ్రీన్ ఫీల్డ్ హైవే)నకు సంబంధించి భూసేకరణ ద్వారా సేకరించిన భూముల్లో కొందరు రైతులకు చెల్లించాల్సిన పరిహారాన్ని వెంటనే చెల్లించి భూములను స్వాధీనం చేసుకోవాలని, నిర్మాణంలో భాగంగా హెచ్‌టి విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. పామర్రు-దిగమర్రు 165 జాతీయ రహదారి నిర్మాణంలో కైకలూరు మండలం గోనేపాడు, తదితర గ్రామాల్లో భూసేకరణ పనులను సంబంధిత రైతులతో మాట్లాడి పూర్తి చేయాలన్నారు. జీలుగుమిల్లి- పట్టిసీమ వరకు నిర్మించే 365 బిబి జాతీయ రహదారికి సంబంధించి భూసేకరణ పనులు పూర్తయ్యాయని, రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రహదారి భవనాల శాఖాధికారులను ధాత్రిరెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, రమణ, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, రహదారులు, భవనాల శాఖ అధికారులు, ఆయా మండలాలకు చెందిన తహశీల్దార్లు పాల్గొన్నారు.

17న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

జిల్లా పరిషత్ సిఇఒ కె.భీమేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ ఒక నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 17వ తేదీ ఉదయం పది గంటల నుంచి ఏలూరులోని జిల్లా పరిషత్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ కె.భీమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు భీమేశ్వరరావు తెలిపారు.

ఆక్వా రైతాంగాన్ని ఆదుకోకపోతే ఆందోళనకు సిద్ధం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించిన ఆక్వా రైతుల సదస్సు

అమెరికా సంకాలను నిరసిస్తూ ఆక్వా రైతుల నిరసన ర్యాలీ

ఆక్వా రైతాంగానికి అండగా సిపిఎం: రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం: రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం

'ఒకపక్క నాణ్యమైన సీడ్ దొరకట్లేదు.. మరోపక్క ఫీడ్ ధరలు అధికంగా ఉన్నాయి. ఇంకోపక్క వైరస్ ప్రభావం.. రొయ్యలకు సరైన ధర లేక గత ఆరు నెలల నుంచి సతమతమవుతుంటే ట్రంప్ విధించిన సుంకం కుతలం చేసింది. తక్షణం ఆక్వా రైతాంగాన్ని ఆదుకోకపోతే ఆందోళన మరింత ఉధృతం చేసేందుకు సిద్ధం' అని ఆక్వా రైతుల సదస్సు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆక్వా రైతుల సదస్సు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి శ్రీనివాసరావు, ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి సదస్సుకు వచ్చిన ఆక్వా రైతులు అనేక సమస్యలను సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వాలకు విదేశీ మారకద్రవ్యం సమకూరుస్తున్నప్పటికీ ఆక్వారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అనేక సమస్యలతో సతమతమవుతున్న ఆక్వా రంగం ట్రంప్ టారిఫ్ దెబ్బతో సంక్షోభంలో పడిందన్నారు. సిండికేట్ మాయాజాలం ఆక్వా రంగాన్ని కుదిపేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని వేసినా ఎటువంటి ఉపయోగమూ లేదన్నారు. ఆక్వా రైతులు చేపట్టే ఆందోళనలకు సిపిఎం పూర్తి మద్దతు ఇస్తుందని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని చెప్పారు. అవసరమైతే ప్రత్యక్షంగా రంగంలోకి దిగి సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాలను కలుపుకుని కృషి చేస్తామన్నారు. రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యాగరమైన ఈ జిల్లాలో ఆక్వా రంగం అభివృద్ధి చెందుతున్న సమయంలో క్లిష్టమైన పరిస్థితులు రావడం బాధాకరమన్నారు. ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, అంతా ఒక తాటిపైకి వచ్చి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర పూర్వపు నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఆక్వా రంగంలో అనేక మంది కార్మికులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు ఉపాధి పొందుతున్నారన్నారు. అలాంటి రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం సరైనది కాదన్నారు. ఆక్వా రంగాన్ని నష్టాల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ సదస్సుకు ఆహ్వానం పలకగా, జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు వందన సమర్పణ చేశారు. ప్రజా కళాకారులు షేక్ వలీ, చైతన్య ప్రసాద్ గీతాలను ఆలపించారు. సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ. కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, ఆక్వా రైతు వర్రె ముసలయ్య, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల నిరసన ర్యాలీ

స్థానిక మావుళ్ళమ్మ గుడి రోడ్లో సిపిఎం ఆధ్వర్యంలో ఆక్వా రైతులను ఆదుకోవాలని, అమెరికా సుంకాలను ఎత్తివేయాలని ఆక్వా రైతులు నిరసన ర్యాలీ చేపట్టారు. సదస్సుకు హాజరైన నేతలంతా ర్యాలీలో పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో రాణించిన అక్కాచెల్లెళ్లు

ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అభినందన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



అక్కాచెల్లెళ్లను అభినందిస్తున్న ఎంఎల్‌ఎ బాలరాజు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారిని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అభినందించారు. రామన్నపాలెం గ్రామానికి చెందిన గెడ్డం పండుకు ఇద్దరు కుమార్తెలు కాగా ఇద్దరిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిస్తున్నాడు. వారిలో పెద్ద పాప తులసి ఇంటర్ రెండో సంవత్సరం హెచ్ఇసి చదువుతూ 1000 మార్కులకు 825 మార్కులతో కళాశాల ప్రథమ స్థానం సాధించింది. చిన్నకుమార్తె పూజ ప్రథమ సంవత్సరం హెచ్ఇసి చదువుతూ 500 మార్కులకు 449 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు విద్యార్థులను మంగళవారం బర్రింకలపాడులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ చేతులమీదుగా సన్మానించి వారిరువురికి చెరొక రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో చదువుకు కూడా సహాయం అందిస్తానన్నారు. ఇద్దరు విద్యార్థినులను కళాశాల అధ్యాపక బృందంతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

బాలుడికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు

మోక్షిత్ రిషినిహార్

ప్రజాశక్తి - కుక్కునూరు

కొన్ని కొన్ని సంఘటనలు అనుకోకుండా జరిగిపోతాయి. కొన్ని కొన్ని సంఘటనలు ఎన్నో ఏళ్లు తపస్సు చేసినా అలానే మిగిలిపోతాయి. గిన్నిస్ బుక్‌లో పేరు అంటే అది ఊహకు అందని విషయమని ప్రయత్నాలు కూడా చేయరు. కాని గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో ఏజెన్సీ చిన్నోడి పేరు నమోదైంది. మండలంలోని పెదరావిగూడెం పంచాయతీలోని వెంకటాపురం గ్రామంలో శెట్టి గోపీ, మేరీ గ్రేస్ దంపతుల చిన్న కుమారుడు మోక్షిత్ రిషి నిహార్ సంగీతంలో వరల్డ్ రికార్డ్‌తో పాటు గిన్నిస్ బుక్‌లో పేరు నమోదు చేసుకున్నాడు. గత ఆరు నెలల వ్యవధి కాలంలో అగస్టీన్ దండంగి సారథ్యంలో సంగీతం (కీ బోర్డ్)లో మెలకువలు నేర్చుకుని వరల్డ్ గిన్నీస్ బుక్ ఆఫ్ అసోసియేషన్ వారిని సంప్రదించి వారి వద్ద సమ్మతి పత్రం వచ్చేంతవరకు ఉండిప్రపంచంలో 18 దేశాల సంగీత విద్వాంసులు ఒకేసారి మ్యూజిక్ ప్లే చేసి గిన్నిస్‌లో పేరు లిఖించుకున్నాడు. ఈ సందర్భంగా మోక్షిన్ రిషినిహార్‌ను పలువురు అభినందిస్తున్నారు.

కొల్లేటి లంక వాసుల దాహార్తి తీర్చాలి

ప్రజల కోసం సిపిఎం పలు సేవా కార్యక్రమాలు

జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రజల కోసం సిపిఎం అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి చెప్పారు. మండలంలోని వంక వారిగూడెంలో వితంతులకు, వికలాంగులకు, వృద్ధులకు సిపిఎం ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేసి భోజనం ఏర్పాటు చేశారు. రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ చంద్రా శ్రీరాములు సేవా దృక్పథంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం ధర్మారావు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి చేతులమీదుగా గ్రామంలోని వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేసి అనంతరం భోజన సదుపాయం కల్పించామన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సిపిఎం ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. గతంలో పోలవరం ప్రాజెక్టు ముంపు సమయంలో పెద ఎత్తు ప్రాజెక్టు కట్ట తెగిపడినప్పుడు నిర్వాసితులను ఆదుకోవడంలో సిపిఎం ముందుందని గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ సేవా దృక్పథంతో ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం ధర్మారావు, మండల కమిటీ సభ్యులు సింబత్తుల సీతారామయ్య, చిట్టి బొమ్మల కొండలరావు, కారం నాగదుర్గ, జిల్లా కమిటీ సభ్యులు గూడెల్లి వెంకటరావు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సిపిఎం నేతలు

ఉపాధి హామీ బకాయిలను విడుదల చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు

ప్రజాశక్తి - భీమడోలు

ఉపాధి హామీ కార్మికులకు గత మూడు నెలల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు కోరారు. భీమడోలులోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన సిఐటియు మండల శాఖ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లింగరాజు హాజరై మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు బకాయిలు విడుదలకాని కారణంగా వారు ఆర్థికపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి బకాయిలను తక్షణమే విడుదల చేయకుంటే వారిని సమీకరించి సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇదేవిధంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు గత రెండు నెలలుగా పెండింగ్ ఉన్న బిల్లులు విడుదల చేసి వారిని ఆదుకోవాలని కోరారు. ఏజెన్సీల కార్మికులకు రూ.పదివేల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్ల భాస్కరరావు, సిఐటియు నాయకులు శ్రీనివాసరావు, పద్మ, భారతి, బేబి పాల్గొన్నారు.

పలుచోట్ల అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు అగ్నిమాపక కేంద్రం అధికారి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు మంగళవారంతో రెండో రోజుకు చేరాయి. దీనిలో భాగంగా భీమడోలు జంక్షన్‌లో ప్రజలకు అగ్ని ప్రమాదాలు, నివారణ సిబ్బంది అందించే సేవలు ఇతర అంశాలను వివరించేందుకు డెమో ప్రదర్శన నిర్వహించారు. కరపత్రాల పంపిణీ చేపట్టారు. అనంతరం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నూజివీడు టౌన్ : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నూజివీడు ఇన్‌ఛార్జి అగ్నిమాపక కేంద్రం అధికారి మత్తయ్య సూచించారు. అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని డిమార్ట్, ఎపిఎస్‌ఆర్‌టిసి బస్టాండ్, ద్వారక థియేటర్లలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అక్కడ ఉన్న స్థానిక ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై ప్రయోగాత్మక అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు 101, 102 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆసుపత్రికి రూ.5.50 లక్షల విలువైన పరికరాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

స్థానిక ప్రభుత్వాసుపత్రికి అల్లూరి సర్వారాయుడు ఫౌండేషన్ (నవభారత్ ఆయిల్ కంపెనీ) ఆర్థిక సాయంతో రూ.5.50 లక్షల విలువైన వైద్య సేవలందించేందుకు 158 పరికరాలను అందించారు. ఈ పరికరాలను ఆసుపత్రి ఛైర్మన్ ఎంపిపి గంజిమల రామారావు ఆధ్వర్యంలో వైద్యాధికారిణి తస్లీమా, డెంటల్ డాక్టర్ శ్రీనివాస్, వైద్య సిబ్బందికి, పిఆర్ఒ ఎవి.రాఘవరావు, అసిస్టెంట్ మేనేజర్ సిద్ధార్థ, ఎఎం.లీలాకృష్ణ అందించారు. పేద ప్రజల కోసం అల్లూరి సర్వారాయుడు ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నవభారత్ కంపెనీ సిబ్బంది చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ నరసింహారాజు, నిమ్మగడ్డ కృష్ణవేణి, కాకర్ల శేషు, పోతురాజు, నిమ్మగడ్డ రవీంద్ర, జనసేన పార్టీ నాయకులు సంకు మధుబాబు, టిడిపి నాయకులు బొబ్బర చిన్నరాజు, నల్లూరి రాజేంద్రప్రసాద్, రైతులు, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆటో బోల్తా పడి ఐదుగురు మహిళా కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆటో బోల్తా పడి ఐదుగురు గాయాలపాలైన ఘటన మండల పరిధిలోని మీర్జాపురం గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కొందరు కూలీలు నిత్యం సీతారామపురం గ్రామంలోని సమోసాల కంపెనీలో పని చేసేందుకు వెళ్తుంటారు. ఎప్పటిలాగానే మంగళవారం ఫ్యాక్టరీలో పని ముగించుకుని ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా మీర్జాపురం గ్రామం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గొల్లపల్లి గ్రామానికి చెందిన బచ్చు ఆశారాణి, బండి చిట్టిపాప, దాసరి సుశీల, దాసరి మేరి, బండి సుమతి గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పొలసానిపల్లి గ్రామం ఎస్‌సి కాలనీలో నిర్మాణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమానించిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు భీమడోలు ఎస్ఐ తెలిపారు. ఈ నెల 12వ తేదీ రాత్రి నిర్మాణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించినట్లు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై దర్యాప్తు చేసిన భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ ఈ సంఘటనలకు బాధ్యులుగా గుర్తించిన తండ్రి, కొడుకులు ఉండి రాంబాబు, ఉండి సాయి వీరాస్వామిలను అరెస్టు చేశారు. మంగళవారం కోర్టుకు హాజరు పరిచినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - ముసునూరు

నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలో మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో పామర్తి రమేష్ వద్ద ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడుల్లో నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చెల్లని చెక్కు కేసులో నూజివీడుకు చెందిన మహమ్మద్ రెహమాన్ ఖాన్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.నాలుగు లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. నూజివీడుకు చెందిన మన్నేని మురళీకృష్ణ 2021 జులై 7న రూ.మూడు లక్షలు మహమ్మద్ రెహమాన్ ఖాన్‌కు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తరువాత బాకీ చెల్లించమని మురళీకృష్ణ కోరగా 2022 ఏప్రిల్ 17న రూ.మూడు లక్షలకు చెక్కు ఇచ్చారు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా రెహమాన్ ఖాతాలో నగదు లేదని తిప్పి పంపారు. దీనిపై కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814

బెల్టుషాపులపై చర్యలు తీసుకోండి

భీమడోలు మండల సమావేశంలో కోరిన పలువురు

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలోని కొల్లేటి లంక గ్రామాల దాహార్తిని తీర్చడంతో పాటు, ఇతర అవసరాల కోసం ఏలూరు కాలువను కట్టివేసేంతవరకు ఆగడాల లంక ఛానల్‌తో పాటు, ఇతర అవుట్‌లెట్లు, ఎస్కేప్ల ద్వారా కాలువ నీటిని అందించాలని భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు కోరారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి కనమాల రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగ హాజరయ్యారు. కార్యక్రమ నిర్వహణ ఎంపిడిఒ పద్మావతి దేవి చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నప్పటికీ కొందరికి పనులను చూపడంలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు వివక్ష ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ బకాయిలు చెల్లింపులు జరగక కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మండల పరిషత్ పాఠశాలల కుదింపు, తరగతుల క్రమబద్ధీకరణ, నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు దూర ప్రాంతాల్లో గల పాఠశాలలకు తరలింపు చేయడం వంటి కార్యక్రమాలను విద్యాశాఖ నూతన విద్యా విధానం పేరున అమలు చేయరాదని, విద్యార్థులకు విద్యను దూరం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి విస్తరణ సందర్భంగా అంబరుపేట గ్రామపంచాయతీ పరిధిలోని కొండ్రెడ్డి నగర్ ప్రాథమిక పాఠశాలను తొలగించారని, నష్టపరిహారంగా రూ.28 లక్షల కేటాయింపు జరిగినప్పటికీ నూతన పాఠశాలను ఏర్పాటు చేయలేదని తెలిపారు. భీమడోలు మండల పరిషత్ వద్ద నిధుల కొరత ఏర్పడిన నేపథ్యంలో వేసవిలో తాగునీరు సరఫరా, ఇతర అత్యవసర కార్యక్రమాలు చేపట్టేందుకు జెడ్‌పి నిధుల మంజూరుకు విజ్ఞప్తి చేయాలని సభ్యులను ఎంపిపి కోరారు. కోర్టు ఆదేశాలపై కొల్లేరు ప్రాంతంలో ఉన్న కొన్ని చేపల చెరువుల తొలగింపులో ఆశ్రిత పక్షపాతం చోటుచేసుకుందని, వాస్తవాలను గుర్తించేందుకు వాటి నివేదికలు సభకు సమర్పించాలని ఎంపిపి అధికారులను కోరారు. మండల పరిధిలోని ప్రతి వీధిలో బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని, ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యారని పలువురు సభ్యులు ఆరోపించారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించిన ఎక్సైజ్ శాఖ ఎస్ఐ ప్రసంగాన్ని అడ్డుకోవడం తోపాటు, తమ కూడా ఇప్పటికిప్పుడు వస్తే బెల్ట్ షాపులు చూపుతామని సభ్యులు సవాలను విసరగా, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ మాట్లాడలేక, మిన్నకొన్నారు. ట్రాన్స్ కో భీమడోలు ఎఇ శివాజీ సోలార్ విద్యుత్ పథకం, రాయితీల గురించి వివరించారు. అధికారులు తగినంత స్థలం కేటాయిస్తే సోలార్ గ్రిడ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

పనిలో అలసత్వం వహించొద్దు

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

అధికారులు పనిలో అలసత్వం వహించవద్దని, ప్రజలకు మెరుగైన సేవలందించలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడిలో వికెఎం ఫంక్షన్ హాలులో గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులతో గ్రామభివృద్ధిపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నాలుగు మండలాల అభివృద్ధిపై చర్చించారు. గ్రామాల్లో పరిస్థితులు, పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, నీటి ఎద్దడి రాకుండా చూడాలని, అందరూ కూడా స్థానికంగా ఉన్న కూటమి నాయకులతో కలిసి పనిచేయాలని సూచించారు. ఎప్పుడు సమీక్షా సమావేశం జరిగిన పూర్తి సమాచారంతో రావాలని, పనిలో అలసత్వం చూపొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి - చింతలపూడి

జీవనోపాధికి సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్ ఎంతో మేలు అని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రగడవరంలో మహిళాలకు చేపల పెంపకంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించడానికి, ప్రతిఒక్కరినీ ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి ఉంగుటూరు

మండలంలోని ఉప్పాకపాడు మోడల్ ప్రైమరీ పాఠశాల స్కూల్ 99వ వార్షికోత్సవం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ కర్నాటి వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు నక్కా సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు అల్లుశ్రీను శిక్షణలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అదరహో అనిపించాయి. ఉపాధ్యాయులు పి.శ్రీదేవి మాట్లాడుతూ మన మోడల్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులను జాయిన్ చేయమని తల్లిదండ్రులను స్కూల్ కమిటీ వారిని కోరారు. విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ వైస్ ఛైర్మన్ వేము నాగమణి, సచివాలయం సిబ్బంది, తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి అన్నారు. మండలంలోని రమణక్కపేటలోని మండల పరిషత్ పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వారి తల్లిదండ్రుల ఆధ్వర్యంలో మంగళవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో ఒక రోజుతో పాటు ఇంటి దగ్గర ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేయిస్తే ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పి ఉపాధ్యాయులు డిఎంఎల్.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జై కాపు సేన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా విజయ్‌కుమార్

ప్రజాశక్తి - మండవల్లి

జై కాపు సేన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మండవల్లికి చెందిన సామాజికవేత్త ప్రొఫెసర్ డాక్టర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షులు బెల్లంకొండ వెంకన్నబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జై కాపు సేన వ్యవస్థాపక అధ్యక్షులు బసవ చినబాబు ఆధ్వర్యంలో బంటుమిల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కాపు సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం అహర్నిశలు అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. యువతకు అండగా నిలిచి ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నుకున్నందుకు ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1,00,116 విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ద్వారకాతిరుమలకు చెందిన వంటిపల్లి శ్రీ రామ పార్వతి వరప్రసాద్ రూ.1,00,116లు విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ కెవి.దుర్గాప్రసాద్‌కు అందించారు. ఆలయ అధికారులు దాతకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, బాండ్ పేపర్ ఇచ్చారు.

జాతీయ స్థాయి పోటీల్లో పవిత్ర ప్రతిభ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శ్రీ చైతన్య పాఠశాల విద్యాబోధనలో చేస్తున్న కరిక్యులం బోధనతో విద్యార్థులు విద్యాపరంగా నిష్ణాతులుగా మారుతున్నారని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఐఎన్‌టిఎస్ఒ ఒలింపియాడ్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి వివిధ అంశాల్లో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా భీమడోలులో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను గన్ని అభినందించారు. దీనిలో భాగంగా జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకున్న బి.పవిత్రకు గన్ని ప్రశంసా పత్రాన్ని అందించారు. ఇదే క్రమంలో అంశాల్లో విజేతలుగా నిలిచిన 142 మందికి బంగారు పతకాలు, ప్రత్యేక బహుమతులను గన్ని అందించారు. ఇటీవల కాలంలో నిర్వహించిన డాక్టర్ జిబిఎస్.రావు మెమోరియల్ జోనల్ కేరళ పోటీల్లో విజేతగా నిలిచిన ఆరుగురు విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డి.సోహిని, డీన్ వి.భార్గవ కిరణ్, ఎఒ ముఖేష్ బాబు, ఒలింపియాడ్ ఇన్‌ఛార్జి శ్రీను పాల్గొన్నారు.

త్వరలోనే వంద పడకల ఆసుపత్రి పూర్తి

చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

త్వరలో చింతలపూడి వంద పడకల ప్రభుత్వాసుపత్రి పూర్తి చేస్తామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణంపై ఇంజినీరింగ్ అధికారులతో, కాంట్రాక్టర్లతో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.22 కోట్ల నాబార్డ్ నిధులు మంజూరయ్యాయని, ఇప్పటివరకు రూ.12 కోట్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రూ.మూడు కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించినట్లు చెప్పారు. కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రకారం మరో రూ.నాలుగు కోట్ల పనులు మే మొదటి వారంలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఆగష్టు 31 నాటికి ఆసుపత్రి పూర్తి చేస్తామన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభోత్సవానికి సన్నద్ధం చేయడానికి సంబంధిత ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు.

సమీక్షిస్తున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు కృషి

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజల భవిష్యత్ నీటి అవసరాలను తీర్చేందుకు బాధ్యతాయుతంగా పనిచేస్తున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. ఈ వేసవిలో ఏలూరు నియోజక వర్గంలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా సమర్థవంతమైన చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఏలూరు మల్కాపురంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్దకు మంగళవారం చేరుకున్న ఎంఎల్ఎ బడేటి చంటి అక్కడ కృష్ణ కెనాల్ నుంచి మోటార్ల ద్వారా ట్యాంకును నింపే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రస్తుతం 17 మోటార్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపే ప్రయత్నం జరుగుతోందన్నారు. కాలువను మరోవారం రోజులపాటు అదనంగా వదలాలని సంబంధిత మంత్రిని కోరానన్నారు. ఆ దిశగా సఫలీకృతమవ్వడం సంతోషాన్నిచ్చిందన్నారు. దీంతో యుద్ధప్రాతిపదికన 17 మోటార్ల సాయంతో కాలువ నుంచి నీటిని తోడే ప్రయత్నంలో భాగంగా రాత్రింబవళ్లు చేసిన కృషి ఫలితంగా ట్యాంకులో ప్రస్తుత నీటిమట్టం 11 మీటర్లకు చేరుకుందన్నారు. ఆ స్థాయి 14 మీటర్లకు చేరుకుంటే భవిష్యత్తులో నీటి కష్టాలు తప్పుతాయని, ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా బాధ్యతాయుతంగా మెలగాలని ఎంఎల్ఎ చంటి సూచించారు.

రాయితీపై వ్యవసాయ ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మంగళవారం పలువురు రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ ఉపకరణాలు అందించినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. రూ.లక్ష రాయితీపై రెండు పవర్ టిల్లర్లు, నాలుగు పవర్ స్ప్రేయర్లు రైతులకు కూటమి నేతల చేతుల మీదుగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పోలవరం మండలాధ్యక్షులు గుణపర్తి వీర వెంకట సత్యనారాయణ (చిన్ని), కొత్తపట్టిసీమ నీటి సంఘం అధ్యక్షులు వీరపుశెట్టి వెంకటరత్నం, టిడిపి మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ, ఉపాధ్యక్షులు నునకాని రాంబాబు, నాగిరెడ్డి నాగేశ్వరరావు, డోకల నాగేశ్వరరావు, బొరును రాంబాబు, కిషోర్, చీకట్ల సాయికృష్ణ, ఎం.సునీల్ పాల్గొన్నారు.

వాసుబాబుకు వైసిపి మండలాధ్యక్షుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

వైసిపికి పూర్వవైభవం తీసుకొచ్చేలా క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేసేలా నూతన మండలాధ్యక్షులు వ్యూహాత్మక కార్యాచరణ అమల్లో భాగస్వాములు కావాలని ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ, పిఎసి సభ్యుడు పుప్పాల వాసుబాబు అన్నారు. వైసిపి సంస్థాగత కమిటీల్లో భాగంగా నియోజకవర్గంలో నాలుగు మండలాలకు నూతన అధ్యక్షులను సోమవారం వెల్లడించిన నేపథ్యంలో ఆయనను నాలుగు మండలాల అధ్యక్షులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల అధ్యక్షుడు మరడ వెంకట మంగారావు, రావిపాటి సత్యశ్రీనివాస్, సంకు సత్యకుమార్, దండు రామకృష్ణంరాజులు వాసుబాబును కలిశారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

మండవల్లి : వర్షాలు పడుతున్న సమయంలో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖాధికారి రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయన్నారు. వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలను పట్టుకోకూడదన్నారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరాఅయ్యే అవకాశం ఉందన్నారు. వర్షం పడుతున్న సమయాల్లో ఇళ్లల్లో ఉన్న మోటార్లను కూడా తాకకూడదన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా కరెంటు స్తంభాలు వాలిపోయినట్లు, విద్యుత్ వైర్లు తెగిపడినట్లు గమనిస్తే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారాన్ని అందిస్తే విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి అటు దిశగా వెళ్లే ప్రజల పశువుల ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వల్ల సంభవించే ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ఉంగుటూరు

పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐసిడిఎస్ పీడీ పి.శారద కోరారు. మండలంలోని కైకరంలో పలు అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించే పోషణ పక్వాడ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె సమీక్షించారు. గర్భిణులు ప్రతినెలా బరువు పరిశీలించుకోవాలని, అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నూజివీడు టౌన్ : పట్టణ పరిధిలోని గొడుగువారిగూడెం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు.

ఎన్నికల హామీల అమల్లో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎన్నికల హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. టి.నరసాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) మండల సమావేశం వీరంకి వెంకట్రావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణచైతన్య మాట్లాడుతూ సిపిఐ సమ సమాజ స్థాపన కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడంతో పాటు నిత్యావసరాల సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు కూలీ రూ.700 ఇవ్వాలని ఆయన కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు, పాపారావు, పులి సత్యనారాయణ, పొదిల సుందరం, చవటపాం బాల శౌరీ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభం

భీమడోలు : పొలసానిపల్లి గ్రామ ప్రజలకు పంచాయతీ సేవలు మరింత సమర్థవంతంగా అందించేందుకు పంచాయతీ కార్యాలయాన్ని అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతానికి మార్చినట్లు సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. రూ.23 లక్షల ఉపాధి హామీ, గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించిన నూతన భవనాన్ని సర్పంచి మంగళవారం ప్రారంభించారు. ఈ విషయమై ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు సహాయ, సహకారాలతో పాటు అనుమతులను మంజూరు చేసేందుకు సహకరించాలని తెలిపారు. ఇప్పటివరకు దశాబ్దాల కాలంగా గ్రామపంచాయతీ కార్యాలయం దాదాపుగా శిథిలావస్థకు చేరిన ఆవరణలో ఉండేది. దీంతో వివిధ పనులకు కార్యాలయానికి వచ్చే ప్రజలతోపాటు, పలు కార్యక్రమాలు, సభలను ఆ ప్రాంతంలో నిర్వహించేందుకు ఇబ్బందిగా ఉండేది. సమస్యను గుర్తించిన సర్పంచి సమస్యను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సహకారంతో సమస్యను పరిష్కరించారు.

హనుమంతు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేస్తున్నారని మారం హనుమంతును ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అభినందించారు. ఏలూరులోని పత్తేబాదలో ఉన్న వృద్ధాశ్రమంలో మారం హనుమంతు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ బడేటి చంటి హాజరై కేక్ కట్ చేసి అన్నదానం ప్రారంభించారు. అనంతరం ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ గతంలో కార్పొరేటర్‌గా పనిచేసి, వన్ టౌన్ క్లస్టర్ ఇన్‌ఛార్జిగా ఉంటూ అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్‌ను నడిపిస్తున్న మారం హనుమంతు ముందు ముందు ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఆయన ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించిన ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, వృద్ధులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఎస్‌సి, ఎస్‌టి, బిసి తరగతులు ఐకమత్యంతో ఉంటే తమ హక్కులు సాధించుకోవటం సులభతరమవుతుందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. కొయ్యలగూడెం కృపా సన్నిధి ఆవరణలో పాస్టర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశం బొగ్గవరపు బాబూరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి చాగంటి సంజీవ్, ప్రముఖ విద్యా వేత్త అలుగు ఆనందశేఖర్, హోప్ మినిస్ట్రీస్ అధినేత గెడ్డం జాషువా హాజరై మాట్లాడారు. ఐకమత్యంతో ఉంటే హక్కులు సాధించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎస్.స్నేహన్, పాల్ అన్న, కోటిపల్లి బెంజిమెన్, జీవన్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

VODUGU LAXMI అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.23-10-2019న T8573746 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్ పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.2-04-2025న బియ్యపు తిప్ప గ్రామం నుండి నరసాపురం మండలం, వేములదీవి గ్రామంలోని సెంటర్‌కు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

VODUGU LAXMI
W/o. Vodugu Srinu
D.No. 2-30, Sitarama Nagar, Biyyapu Tippa
Narasapuram (M), W.G.Dt., A.P.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, వెంకట్రామపురం గ్రామానికి చెందిన గంగోలి సుసన్న, W/o. దుర్గా కుమార్ పోత్రాజ్ అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. వెంకట్రామపురం ఇంటి దగ్గర నుండి పెనుగొండ బైక్ పై వస్తుండగ నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. పాస్పోర్ట్ నెంబర్ : M2693664 గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

గంగోలి సుసన్న
W/o. దుర్గా కుమార్ పోత్రాజ్
వెంకట్రామపురం,
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా,
Cell No: 80083 23352

ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M.O.P.No. 7/2023

Between:
బొక్కా శ్రీరామకృష్ణమూర్తి ...పిటిషనర్
and
బొక్కా లక్ష్మీహేమదుర్గ ...రెస్పాండెంటు

రెస్పాండెంటు:
To:
బొక్కా లక్ష్మీహేమదుర్గ
W/o బొక్కా శ్రీరామకృష్ణమూర్తి
D/o యనమదాల ఏడుకొండలు
హనుమాన్ టెంపుల్, పూలపల్లి, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా

పై నెంబరు కేసులో పిటిషనర్, మీ పైన విడాకుల నిమిత్తం పిటీషన్‌వేయగా మీకు శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికిని మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పేపర్లో ప్రకటనకు ఆర్డర్ వేసియున్నారు.

కావున పై నెంబరు కేసులో ది. 01-05-2025వ సం॥రం తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు మీరు గాని, మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

// By orders of Court //

వాయిదా: 01-05-2025

Rampa Pullaji M.A.,B.L,
Advocate,
Narsapuram
Cell: 9849300413

Narsapuram
Dt. 15-04-2025